క్లుప్తంగా

చిల్వకోడూర్ వాసికి డాక్టరేట్



డాక్టరేట్ అందుకుంటున్న మౌనిక

గొల్లపల్లి: మండలంలోని చిల్వకోడూర్‌కు చెందిన కోరుట్ల మండలం పైడిమడుగు పశువైద్య సబ్ సెంటర్ వెటర్నరీ లైవ్ స్టాక్ ఆఫీసర్ కందుకూరి పూర్ణచందర్–కవిత దంపతుల మొదటి కుమార్తె కందుకూరి మౌనిక ఉస్మానియా యూనివర్సిటీలో స్టాటిస్టిక్స్ విభాగంలో డాక్టరేట్ పొందింది. ఈ సందర్భంగా ఆమె కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.

రక్తదానం



రక్తదానం చేస్తున్న కార్యదర్శి శ్రీనివాస్

ఇబ్రహీంపట్నం: మండలంలోని వేములకుర్తికి చెందిన వనిత మెట్‌పల్లి ప్రభుత్వాసుపత్రిలో బుధవారం డెలివరీ అయ్యింది. అయితే ఓ పాజిటివ్ రక్తం అవసరం ఉందని డాక్టర్లు చెప్పడంతో మండలంలోని గోధూర్ గ్రామానికి చెందిన పంచాయతీ కార్యదర్శి గురుడు శ్రీనివాస్ స్పందించారు. మెట్‌పల్లిలో బ్లడ్‌బ్యాంక్‌కి వెళ్లి రక్తదానం చేశారు. తన పుట్టినరోజు సందర్భంగా రక్తదానం చేసిన శ్రీనివాస్‌ను గ్రామస్తులు అభినందించారు.

ఉత్సవమూర్తుల ఊరేగింపు



స్వామివారి ఊరేగింపులో భక్తులు

కథలాపూర్: మండలకేంద్రంలో గుండు పెరమాండ్లస్వామి ఉత్సవమూర్తులను బుధవారం పల్లకిలో ఊరేగించారు. ఉత్సవాల్లో సర్పంచ్ కంటె నీరజ, అర్చకులు, నాయకులు, నిర్వహణ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మానాలకు ఆర్టీసీ బస్సు పునః ప్రారంభం



ఆర్టీసీ బస్సును ప్రారంభిస్తున్న గ్రామస్తులు

మల్యాల: మండలంలోని మానాల గ్రామానికి ఆర్టీసీ బస్సు బుధవారం నుంచి పునః ప్రారంభమైంది. 8 నెలలుగా మానాల గ్రామానికి ఆర్టీసీ బస్సు నిలిపివేయడంతో స్థానిక సర్పంచ్ నల్లాల లక్ష్మీబుచ్చయ్య, ఉపసర్పంచ్ ఎడిపెల్లి రాజన్న ఆర్టీసీ బస్సు తిరిగి పునః ప్రారంభించాలని ఎమ్మెల్యే రవిశంకర్ దృష్టికి తీసుకెళ్లగా బస్సు డిపో మేనేజర్‌తో మాట్లాడి, బస్సు నడిపేలా కృషి చేశారు. ఈ మేరకు బుధవారం ఆర్టీసీ బస్సును ప్రారంభించారు. నిత్యం ఐదు ట్రిప్పులు బస్సు నడుపుతామని, ప్రయాణికులు ఆర్టీసీని ఆదరించాలని డిపో మేనేజర్ వెంకట నర్సప్ప కోరారు. ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు మిట్టపల్లి సుదర్శన్‌కు మానాల గ్రామ ప్రజాప్రతినిధులు, ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. ఆర్టీసీ సీఐ విజయలక్ష్మి, స్వామి, ప్రభాకర్, మునీందర్, మల్యాల పీఏసీఎస్ చైర్మన్ రాంలింగారెడ్డి పాల్గొన్నారు.

నేటి నుంచి పొరండ్లలో భీమేశ్వరస్వామి జాతర



జగిత్యాలరూరల్: జగిత్యాలరూరల్ మండలం పొరండ్ల గ్రామంలోని శ్రీభీమేశ్వరస్వామి దేవాలయంలో గురువారం నుంచి జాతర ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. జాతర ఉత్సవాలకు ఆలయంతో పాటు రథాన్ని రంగులతో ముస్తాబు చేశారు. 6న సాయంత్రం స్వామివారి కల్యాణోత్సవం, 7న ఉదయం నుంచి సాయంత్రం వరకు స్వామివారికి ఒడిబియ్యాలు, అన్నదాన కార్యక్రమం, 8న ఉదయం రథోత్సవ కార్యక్రమం నిర్వహించనున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.

పెద్దమ్మతల్లి జాతర ఉత్సవాలు..

జగిత్యాలరూరల్ మండలం హన్మాజీపేటలోని శ్రీపెద్దమ్మతల్లి ఆలయంలో 6 నుంచి 8 వరకు జాతర ఉత్సవాలు జరగనున్నాయి.

ఇరుకు రోడ్డే ప్రధాన సమస్య

- నిత్యం ఇబ్బంది పడుతున్న వాహనదారులు, గ్రామస్తులు
- రోడ్డు విస్తరణ చేయాలని విజ్ఞప్తి
- సీఎంవో కార్యాలయం నుంచి హామీ వచ్చినా ముందుకు సాగని పనులు
- నిధుల మంజూరుకు రూ.3కోట్లతో ప్రతిపాదన



బీర్‌పూర్ మండల కేంద్రంలో రోడ్డు ఇరుకుగా ఉండడంతో నిలిచిన వాహనాలు

సారంగాపూర్: ప్రభుత్వం బీర్‌పూర్ గ్రామాన్ని మండల కేంద్రంగా ప్రకటించిన తర్వాత గ్రామం మరింత అభివృద్ధి చెందుతుందని భావించిన గ్రామస్తులకు నిరాశే మిగిలింది. మండల కేంద్రం ఏర్పాటై ఆరేళ్లు అవుతున్నా.. గ్రామంలోని ప్రధాన రహదారిని డబుల్‌రోడ్డుగా మార్చాలన్న ప్రజలు డిమాండ్ నెరవేరడం లేదు. రోడ్డు విస్తరణ చేయాలని గతంలో గ్రామానికి చెందిన యువ చైతన్య యూత్ సభ్యులు ఏకంగా సీఎం కేసీఆర్‌కు లేఖ రాశారు. స్పందించిన సీఎంవో కార్యాలయం రోడ్డు విస్తరణకు చర్యలు తీసుకుంటామని చెప్పింది. దీనికి అనుగుణంగా అధికారులు రోడ్డు విస్తరణకు రూ.3కోట్లు ఖర్చు అవుతుందని సీఎంవో కార్యాలయానికి ప్రతిపాదనలు పంపించారు.

ఇరుకుగా రెండు కిలోమీటర్ల రోడ్డు

గ్రామంలో రెండు కిలోమీటర్ల రోడ్డు చాలా ఇరుకుగా ఉంది. ఎదురుగా ఒక వాహనం వస్తే మరో వాహనం వెళ్లేని పరిస్థితి. గ్రామంలోకి లారీల ద్వారా ఏదైనా వస్తువులు రావాలంటే వచ్చి వెళ్లడానికి కనీసం మూడు గంటలు పడుతుంది. దీంతో భారీ వాహనదారులు గ్రామంలోకి రావడానికి జంకుతున్నారు. వర్షాకాలంలో పరిస్థితి మరింత దారుణం. ఎదురుగా వచ్చే వాహనానికి సైడ్ ఇవ్వడానికి ప్రయత్నిస్తే వాహనాలు బురదలో దిగబడుతున్నాయి.

సీఎం దృష్టికి తీసుకెళ్లిన యూత్ సభ్యులు..

బీర్‌పూర్ మండల కేంద్రం ఏర్పాటు ద్వారా ప్రభుత్వం గొప్ప నిర్ణయం తీసుకుందని యువచైతన్య యూత్ సభ్యులు సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలుపుతూ, గ్రామంలోని 2 కిలోమీటర్ల రోడ్డును డబుల్‌రోడ్డుగా మార్చాలని లేఖ ద్వారా వివరించారు. స్పందించిన సీఎంవో కార్యాలయం రోడ్డు విస్తరణకు సంబంధిత అధికారులను ఆదేశించారు. సమస్య పరిష్కారమవుతుందని, సీఎంవో కార్యాలయం యువచైతన్య యూత్ సభ్యులకు సమాధానం ఇచ్చింది. అయితే ప్రభుత్వం గ్రామంలో నిర్మించిన బీటీరోడ్డు పూర్తిగా ధ్వంసం కాగా ఇటీవల రూ.45లక్షలతో ఆర్‌అండ్‌బీ శాఖ బీటీరోడ్డును ఏర్పాటు చేసింది. కానీ డబుల్‌రోడ్డు ప్రతిపాదనలకే పరిమితమైందని విమర్శలు వస్తున్నాయి.

త్వరలో నిధులు మంజూరయ్యే అవకాశం



బీర్‌పూర్ గ్రామంలోని 2 కిలోమీటర్ల రోడ్డును డబుల్‌రోడ్డుగా మార్చడానికి సీఎంవో నుంచి వచ్చిన ఆదేశాలతో సర్వే చేసి రోడ్డు నిర్మాణానికి రూ.3కోట్లు ఖర్చు అవుతుందని ప్రతిపాదనలు పంపించాం. రోడ్డుతో పాటు డ్రైనేజీ నిర్మించడానికి ప్రతిపాదించాం. త్వరలో నిధులు మంజూరయ్యే అవకాశం ఉంది. – రాజశేఖర్, ఆర్‌అండ్‌బీ ఏఈ, బీర్‌పూర్, సారంగాపూర్

జాతర సమయంలో ఇబ్బంది



గ్రామంలోని రెండు కిలోమీటర్ల రోడ్డును డబుల్‌రోడ్డుగా మార్చాలి. బీర్‌పూర్ జాతర సమయంలో శ్రీలక్ష్మీనృసింహస్వామిని దర్శించుకోవడానికి వేలాది మంది భక్తులు వచ్చిన సమయంలో పరిస్థితి మరింత దారుణంగా ఉంటుంది.
– భైరవేని సత్యనారాయణ, బీర్‌పూర్

రోడ్డు విస్తరణ చేయాలి



డబుల్‌రోడ్డు ఏర్పాటు విషయం ప్రభుత్వ దృష్టిలో ఉంది. దీనిపై ఎమ్మెల్సీ కవిత, ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ దృష్టికి తీసుకువెళ్లినం. రోడ్డు విస్తరణ జరిగితేనే గ్రామం మరింత అభివృద్ధి సాధించడానికి అవకాశం ఉంది.
– గర్శకుర్తి శిల్ప, సర్పంచ్, బీర్‌పూర్

ప్రజా సమస్యల పరిష్కారానికే ‘మీరు నేను’

- ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్



లక్ష్మీదేవిపల్లిలో మహిళలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

సారంగాపూర్: రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటి వరకు ఒక్క లక్ష్మీదేవిపల్లి గ్రామానికి సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల కింద రూ.19.97కోట్లు ఖర్చు చేసిందని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ అన్నారు. ఈ మేరకు బుధవారం రాత్రి 9 గంటలకు మండలంలోని లక్ష్మీదేవిపల్లిలోకి చేరుకున్న ఎమ్మెల్యే ‘మీరు నేను’ కార్యక్రమంలో భాగంగా గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలను నేరుగా కలిసి, వారి సమస్యలు పరిష్కరించడానికి ‘మీరు నేను’ కార్యక్రమం దోహదపడిందని తెలిపారు. పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. రాత్రి గ్రామంలోనే బసచేశారు. మరుసటి రోజు లక్ష్మీదేవిపల్లి, ధర్మనాయక్‌తండా గ్రామాల్లో ఆయన పర్యటించనున్నారు. ఆయన వెంట విండో చైర్మన్ ఏలేటి నర్సింహారెడ్డి, ఎంపీటీసీ ఏలేటి మమత, టీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే రామ్‌లు మృతికి సంతాపం



సంతాపం తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు

మెట్‌పల్లి: మాజీ ఎమ్మెల్యే కొమొరెడ్డి రామ్‌లు మృతికి బుధవారం పలువురు సంతాపం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ కార్యాలయంలో మౌనం పాటించి సంతాపం తెలిపారు. కార్యక్రమంలో ధర్మపురి దేవస్థానం కమిటీ మాజీ అధ్యక్షుడు జువ్వాడి కృష్ణారావు, నాయకులు అల్లూరి మహేందర్‌రెడ్డి, తిప్పిరెడ్డి అంజిరెడ్డి, బెజ్జారపు శ్రీనివాస్ ఉన్నారు. బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఇల్లెందుల శ్రీనివాస్ రామ్‌లు మృతికి సంతాపం తెలిపారు.

పార్టీకి తీరని లోటు..

కథలాపూర్: మెట్‌పల్లి మాజీ ఎమ్మెల్యే కొమిరెడ్డి రాములు మృతిపై కాంగ్రెస్ సీనియర్ నేత ఆది శ్రీనివాస్ సంతాపం వ్యక్తం చేశారు. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి రాములు కృషి చేశారని, ఆయన మృతి పార్టీకి తీరని లోటన్నారు. కథలాపూర్ కాంగ్రెస్ నాయకులు సంతాపం తెలిపారు.

‘మంత్రి ఈశ్వర్‌ను విమర్శించడం తగదు



మాట్లాడుతున్న ఎంపీపీ, నాయకులు

గొల్లపల్లి: ఎమ్మార్పీఎస్ నాయకులు మంత్రి కొప్పుల ఈశ్వర్‌ను విమర్శించడం సరికాదని ఎంపీపీ నక్క శంకరయ్య అన్నారు. ఈ మేరకు బుధవారం గొల్లపల్లిలో సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏఎంసీ చైర్మన్ కాంపల్లి హన్మండ్లు, జిల్లా గ్రంథాలయ సభ్యుడు మారంపల్లి బాబు, ఎస్సీ సెల్ అధ్యక్షుడు మాదరి రమేశ్, నరేశ్, రాకేశ్, రత్నం, సతీశ్, రవీందర్, మల్లయ్య పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

✦సుందరీకరణ పనులకు రూ.30కోట్లు

ధర్మపురి: గ్రామంలో చేపడుతున్న అభివృద్ధి పనులకు ఆర్‌అండ్‌బీ నిధులు రూ.30 కోట్లు మంజూరైనట్లు మంత్రి కొప్పుల ఈశ్వర్ తెలిపారు. ధర్మపురి నుంచి మండలంలోని దొంతాపూర్ గ్రామం వరకు డబుల్‌రోడ్డు నిర్మాణ పనులు చేపట్టనున్నారు. డబుల్‌రోడ్డుతో పాటు గ్రామాల్లో సెంట్రల్ లైటింగ్, ఇరువైపులా డ్రైనేజీలు, వంతెనల పనులు తదితర వాటి కోసం సీఎం కేసీఆర్ ప్రత్యేక చొరవతో నిధులు మంజూరు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

✦పెగడపల్లిలో దిష్టిబొమ్మలు దహనం

పెగడపల్లి: మండల కేంద్రంలో బుధవారం బీజేపీ, బీఆర్‌ఎస్ నాయకులు వేర్వేరుగా దిష్టిబొమ్మలు దహనం చేశారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌ను పోలీసులు అక్రమంగా అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మను బీజేపీ నాయకులు దహనం చేశారు. పదో తరగతి పరీక్ష పత్రాల లీకేజీ వెనుక బండి సంజయ్ కుట్ర ఉందని పేర్కొంటూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, బండి సంజయ్ దిష్టిబొమ్మలు బీఆర్‌ఎస్ నాయకులు దహనం చేశారు.

✦గీతాహవన యజ్ఞం

వెల్గటూర్: ప్రపంచశాంతి కోసం గీతాహవన యజ్ఞం నిర్వహించినట్లు సర్పంచ్ కొప్పుల విద్యాసాగర్ తెలిపారు. వెల్గటూర్ మండలం కుమ్మరిపల్లిలోని ఆంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవం, హనుమాన్ జయంతిని పురస్కరించుకొని రోటిగూడ వాస్తవ్యులు శ్రీహరి మౌనస్వామి ఆధ్వర్యంలో గీతాహవన యజ్ఞం నిర్వహించారు. యజ్ఞం అనంతరం అన్న ప్రసాద వితరణ చేశారు. మాజీ సర్పంచ్ జక్కుల రామయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.

✦మార్కెట్ కమిటీ నియామకంపై హర్షం

మేడిపెల్లి: మేడిపెల్లి మార్కెట్ కమిటీ నూతన పాలకమండలి నియామకంపై చైర్మన్ దొనకంటి ఉమాదేవి, డైరెక్టర్లు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు మార్కెట్ కమిటీ నూతన చైర్మన్, డైరెక్టర్లు బుధవారం వేములవాడలోని ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్‌బాబు నివాసంలో కలిసి కృతజ్ఞతలు తెలిపారు. జెడ్పీ వైస్‌చైర్మన్ హరిచరణ్‌రావు ఉన్నారు.

✦సీసీరోడ్డు పనులు ప్రారంభం

కొడిమ్యాల: మండలంలోని డబ్బుతిమ్మయ్యపల్లిలో రూ.13లక్షలతో మంజూరైన సీసీరోడ్డు నిర్మాణానికి సర్పంచ్ డబ్బు రాధ–గౌతంరెడ్డి బుధవారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ సురకంటి ముత్యంరెడ్డి, ఎంపీటీసీ డబ్బు జగన్మోహన్ రెడ్డి, వార్డ్‌సభ్యులు బొటుకు శ్రీనివాస్, కోఆప్షన్ డబ్బు లచ్చిరెడ్డి, వీవో ఫర్వీన్, లక్ష్మి, పూజ, మల్లారెడ్డి, మల్లేశం, అంజయ్య, పాల్గొన్నారు.

✦వైభవంగా హనుమాన్ మహాయాగం

ధర్మపురి: మండలంలోని దమ్మన్నపేటలో వీరభద్రేశ్వరి స్వామివారి ఆలయంలో బుధవారం హనుమాన్‌యాగం వైభవంగా నిర్వహించారు. హనుమాన్ భక్తమండలి ఆధ్వర్యంలో వేదపండితులు గుండి నర్సయ్యశర్మ, ప్రశాంత్‌శర్మ, విజయ్, శంకర్ శర్మ ప్రత్యేక పూజలు చేశారు.

✦ఆర్‌ఎంపీ, పీఎంపీల సంక్షేమానికి కృషి చేయాలి

మల్లాపూర్: ఆర్‌ఎంపీ, పీఎంపీల సంక్షేమానికి కృషి చేయాలని ఆర్‌ఎంపీ, పీఎంపీల అసోసియేషన్ మండల అధ్యక్షుడు లక్ష్మీనర్సయ్య అన్నారు. ఈ మేరకు బుధవారం మండల కేంద్రంలో అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామీణ ప్రాంతంలో అస్వస్థతకు గురైన ప్రజలకు ప్రథమ చికిత్స అందిస్తున్న ఆర్‌ఎంపీ, పీఎంపీల సేవలు మరువలేనివని కొనియాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆర్‌ఎంపీ, పీఎంపీల సంక్షేమానికి ప్రత్యేక పథకాలను అమలు చేయాలని కోరారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే కొమిరెడ్డి రామ్‌లు మృతికి సంతాపంగా మౌనం పాటించారు.

తల్లిదండ్రుల జ్ఞాపకార్థం..



పండ్లు పంపిణీ చేస్తున్న దేవేందర్ దంపతులు

జగిత్యాలరూరల్: జగిత్యాల పట్టణానికి చెందిన ముసిపట్ల దేవేందర్ తల్లిదండ్రులు ముసిపట్ల వెంకటరమణయ్య, వెంకటలక్ష్మి జ్ఞాపకార్థం ప్రతీ ఏటా హనుమాన్ భక్తులకు సేవలందిస్తున్నారు. కాగా హనుమాన్ జయంతి సందర్భంగా కొండగట్టు వెళ్లే భక్తుల కోసం కరీంనగర్ వెళ్లే రహదారిపై మంచినీరు, పండ్లు ఉచితంగా అందజేశారు.

ఆవాసం నిర్మాణానికి విరాళం



విరాళం అందజేస్తున్న దాత సుదర్శన్

జగిత్యాలటౌన్: పట్టణంలోని ధరూర్ క్యాంపులో సేవాభారతి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వాల్మీకి ఆవాసం నూతన భవన నిర్మాణానికి జగిత్యాలకు చెందిన వ్యాపారవేత్త శివసుదర్శన్–నీరజ దంపతులు రూ.50వేలు అందజేశారు. ఆవాసం అధ్యక్షుడు పురుషోత్తం, ఆవాసం ఆచార్యులు మల్లేశం పాల్గొన్నారు.

పేదల ఆత్మీయ బంధువు సీఎం కేసీఆర్



లబ్ధిదారులతో కల్వకుంట్ల సంజయ్‌కుమార్

మల్లాపూర్: పేదల ఆత్మీయ బంధువు సీఎం కేసీఆర్ అని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు కల్వకుంట్ల సంజయ్‌కుమార్ అన్నారు. ఈ మేరకు బుధవారం మండల కేంద్రంలో ఎంపీపీ కాటిపెల్లి సరోజన–ఆదిరెడ్డి, జెడ్పీటీసీ సందిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డితో కలిసి సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. మండలవ్యాప్తంగా 22 మంది లబ్ధిదారులకు రూ.5.21లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందించినట్లు వారు తెలిపారు. వైస్ ఎంపీపీ గౌరు నాగేష్, రైతుబంధు కమిటీ మండల అధ్యక్షుడు కొమ్ముల జీవన్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు తోట శ్రీనివాస్, పట్టణ అధ్యక్షుడు బండి లింగస్వామి, సీనియర్ నాయకులు కాటిపెల్లి ఆదిరెడ్డి, క్యాతం జీవన్‌రెడ్డి పాల్గొన్నారు.

వినియోగదారుల ఫోరం ఏర్పాటు చేయాలి



ఎమ్మెల్యేతో బార్ అసోసియేషన్ కార్యవర్గం

జగిత్యాలజోన్: నూతనంగా నియామకమైన జగిత్యాల బార్ అసోసియేషన్ కార్యవర్గం బుధవారం ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కాటిపెల్లి శ్రీపాల్ రెడ్డి మాట్లాడుతూ కోర్టులో లిఫ్ట్ ఏర్పాటు చేయాలని, ఎస్సీ, ఎస్టీ కోర్టు ఏర్పాటు, ఫ్యామిలీ కోర్టు, వినియోగదారుల ఫోరం ఏర్పాటుకు కృషి చేయాలని ఎమ్మెల్యే, ఎమ్మెల్సీని కలిసి విజ్ఞప్తి చేసినట్లు ఆయన చెప్పారు. ఇరువురు నాయకులు సానుకూలంగా స్పందించినట్లు చెప్పారు. ఆయా కార్యక్రమాల్లో బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి చీటి రామకృష్ణారావు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి



కోరుట్ల: నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు



రాయికల్: నివాళి అర్పిస్తున్న చైర్మన్, కమిషనర్

జగిత్యాలటౌన్/రాయికల్/ధర్మపురి/కోరుట్ల/పెగడపల్లి/కథలాపూర్/కొడిమ్యాల/గొల్లపల్లి/సారంగాపూర్/ఇబ్రహీంపట్నం/జగిత్యాలరూరల్/మల్యాల: బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి సందర్భంగా బుధవారం జిల్లావ్యాప్తంగా ఆయన చిత్రపటానికి, విగ్రహాలకు పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ అట్టడుగు వర్గాల అభ్యున్నతి, అభివృద్ధి కోసం జగ్జీవన్‌రామ్ చేసిన పోరాటం మరిచిపోలేనిదని కొనియాడారు.



మెట్‌పల్లి: మున్సిపల్ కార్యాలయంలో..

బండి సంజయ్ దిష్టిబొమ్మ దహనం



కోరుట్లరూరల్: దిష్టిబొమ్మ దహనం



సారంగాపూర్: బీర్‌పూర్‌లో..

కొడిమ్యాల/సారంగాపూర్/కోరుట్లరూరల్/ధర్మపురి/మెట్‌పల్లి/గొల్లపల్లి/మల్యాల: పదో తరగతి పరీక్ష పత్రం లీకేజీ కుట్ర ఎంపీ బండి సంజయ్‌దేనని బీఆర్‌ఎస్ నాయకులు ఆరోపించారు. ఈ మేరకు బుధవారం జిల్లావ్యాప్తంగా పీఎం మోడీ, ఎంపీ బండి సంజయ్ దిష్టిబొమ్మలను వారు దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని అప్రతిష్ట పాలు చేయడానికే ఎంపీ బండి సంజయ్ కుట్ర పన్నుతున్నారని విమర్శించారు.



ధర్మపురి: దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు

పేపర్ లీకేజీ ప్రభుత్వ అసమర్థతకు నిదర్శనం



కొడిమ్యాల: సీఎం దిష్టిబొమ్మ దహనం



రాయికల్: ఆందోళన చేస్తున్న బీజేపీ నాయకులు

కోరుట్లరూరల్/రాయికల్/మల్లాపూర్/కొడిమ్యాల/మెట్‌పల్లి రాష్ట్రంలో టీఎస్‌పీఎస్సీ పరీక్ష పేపర్ లీకేజీ ఘటన మరువక ముందే పదో తరగతి పరీక్షా పేపర్ లీక్ కావటం ప్రభుత్వ అసమర్థతకు నిదర్శనమని బీజేపీ నాయకులు ఆరోపించారు. ఈ మేరకు రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు బండి సంజయ్‌ని పోలీసులు అక్రమంగా అరెస్టు చేయటాన్ని నిరసిస్తూ బీజేపీ నాయకులు బుధవారం జిల్లావ్యాప్తంగా నిరసనలు తెలిపారు. ఈ సందర్భంగా సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు.

బీజేపీ నాయకుల ముందస్తు అరెస్ట్



జగిత్యాలక్రైం: పట్టణ పోలీస్‌స్టేషన్‌లో నాయకులు



ఇబ్రహీంపట్నం: నిరసన తెలుపుతున్న నాయకులు

జగిత్యాలక్రైం/ఇబ్రహీంపట్నం/కొడిమ్యాల/రాయికల్/సారంగాపూర్: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌ను పదో తరగతి ప్రశ్నపత్రం లీకేజీ చేశాడని మంగళవారం అర్ధరాత్రి పోలీసులు అరెస్ట్ చేశారు. దీంతో జిల్లాలోని బీజేపీ నాయకులను పోలీసులు బుధవారం తెల్లవారుజామున అరెస్ట్ చేసి ఆయా పోలీస్‌స్టేషన్‌లకు తరలించారు. నిరసన కార్యక్రమాలు చేపట్టకుండా ముందస్తుగా బీజేపీ నాయకులను అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించినట్లు పోలీసులు పేర్కొన్నారు.